# ‘సంక్షోభాలకు మూలమైన పాలకుల విధానాలపై కార్మికవర్గం ఉద్యమించాలి’

## ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రసదస్సులో వక్తల ఉద్ఘాటన




రాష్ట్రసదస్సులో మాట్లాడుతున్న కా॥జె.కిషోర్‌బాబు

**నెల్లూరు, 1-10-19:**

**‘సామ్రాజ్యవాదం-పెట్టుబడిదారీవర్గాలు సృష్టిస్తున్న ఆర్థిక సంక్షోభాలు-పరిష్కారమార్గాలు’ అనే అంశంపై ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో రాధాకృష్ణ కళ్యాణమండపం - నెల్లూరులో 1-10-19న రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది.**

ఏఐఎఫ్‌టియు(న్యూ)రాష్ట్ర నాయకులు కా॥డివిఎన్ స్వామి సదస్సు ప్రతినిధులకు ఆహ్వానం పలుకగా, సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కా॥సి.పెద్దన్న సదస్సుకు అధ్యక్షత వహించారు. అక్టోబర్ విప్లవ ప్రాధాన్యతను వివరించిన కా॥పెద్దన్న మనదేశంలో కార్మికవర్గం ముందున్న ప్రజాతంత్ర విప్లవ లక్ష్యాన్ని సాధించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ)అధ్యక్షులు కా॥గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ పెట్టుబడిదారీ వర్గం సంక్షోభాలగుండా నడుస్తూ వుంటుందని సోదాహరణంగా వివరించారు. ‘వ్యవసాయ రంగం, పారిశ్రామికరంగం, వ్యాపారరంగం సంక్షోభంలో వున్నాయి. జిడిపి ఫలితాలు ప్రజలకు అందటంలేదు. భారతదేశంలో అర్థ భూస్వామ్య విధానం కొనసాగుతూ, సామ్రాజ్య వాదంతో లంకెవేసుకున్న ఫలితంగా దేశం అధోముఖంగా పయనిస్తోంది. దళారీ పాలకులు సామ్రాజ్యవాదుల ఆదేశాలను శిరసావహిస్తూ ప్రజలపై అంతులేని భారాలను మోపుతున్నారు’. ఈ పరిస్థితుల్లో కార్మికవర్గం, రైతాంగం ఇతర పీడిత సెక్షన్ల ప్రజానీకంతో కలిసి నూతన ప్రజాస్వామిక వ్యవస్థకై పోరాడాలని, దీనికి కార్మికవర్గం నాయకత్వం వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర)రాష్ట్ర అధ్యక్షులు కా॥సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ ప్రపంచ వ్యాపితంగా సంక్షోభం గురించి, పరిశ్రమల మూసివేత, పెట్టుబడిదారులు నష్టపోతున్నారని కొందరు మాట్లాడుతున్నారుగానీ, కార్మికులు ఎదుర్కొంటున్న దుస్థితిని గురించి పేర్కొనటం లేదన్నారు. ‘ప్రజల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. రాష్ట్రంలో ఇసుక సమస్యతో భవననిర్మాణ కార్మికులెందరో అప్పులతో, అర్థాకలితో బ్రతుకులీడుస్తున్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను చట్టపరంగానే రద్దుచేస్తూ పాలకులు కాలరాస్తున్నారు. సామ్రాజ్య వాదులకు దళారుగా వున్న పాలకులు వారి ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు. పార్టీలు వేరైనా పాలకులంతా దోపిడీవర్గానికి సేవచేసేవారే. కార్మికుల గురించి, ఆదివాసుల గురించి, రైతాంగం గురించి వారికేమీ పట్టలేదు’. సమాజంలోని దోపిడీని రూపుమాపేందుకు రైతాంగంతో భుజం భుజం కలిపి భారత కార్మికవర్గం నాయకత్వం వహించాల్సిన ఆవశ్యకతను ఆమె నొక్కి చెపుతూ ముగించారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ)రాష్ట్రకార్యదర్శి కా॥జె. కిషోర్‌బాబు మాట్లాడుతూ దేశంలో సంపద కొంతమంది వద్ద కేంద్రీకృతమవటం పెరుగు తోందన్నారు. ‘ఒకప్రక్క పేదరికం, నిరుద్యోగులు పెరుగుతుండగా మరోవైపు దేశంలో వెయ్యికోట్ల రూ॥పై బడిన ఆదాయంగల వారిసంఖ్య గత సం॥ 820 నుండి ఈ సం॥రం 933కు చేరుకుంది. మరోవైపు కార్మికుల నిజవేతనం నానాటికీ దిగజారిపోతోంది. ప్రభుత్వరంగ సంస్థలను ఒక్కొక్కటిగా తెగనమ్మి వేస్తున్నారు. ప్రభుత్వరంగ బిఎస్‌ఎన్‌ఎల్‌ను ఉద్దేశ్యపూర్వకంగా దివాళా తీయించటాన్ని చూస్తున్నాం. ఆర్థిక ఉద్దీపనలు, బ్యాంకుల విలీనం పేరుతో బడా పెట్టుబడిదారుల రుణాలను మాఫీచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్మికవర్గం జనతాప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాల్ని చేబూని ముందుకు నడవాలని పిలుపునిస్తూ కా॥కిషోర్ తన ప్రసంగం ముగించారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) నిర్వహిస్తున్న సదస్సుకు సంఘీభావంగా కా॥మోడెం మల్లేష్ (ఏఐఎఫ్‌టియు –న్యూ తెలంగాణా అధ్యక్షులు), కా॥గుణాల్ (తమిళనాడు) తదితరులు మాట్లాడారు.

సదస్సు ముగింపులో పాలకులనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ కొన్ని తీర్మానాలను ఆమోదించారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకుడు కా॥గణేష్‌పండా సదస్సుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

०००